కథానిక

# కురూపి భార్య

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

నేను నవమన్మథుణ్ణి. అయితేనేం? నాభార్య కురూపి. చిన్నగా, పొట్టిగా, నల్లగా ఉంటుంది. కాలు పెడగావేసి నడుస్తుంది. చిన్నకళ్లు. కాని అందమైనజుట్టూ, కోయిలకంఠస్వరమూనూ! ఆ రెండు విషయాల్లోనూ భగవంతుడు ఇతరత్రా ఎందుకు చేశాడో నాకయితే తెలీదు.

ఇంకా కాపరానికి వచ్చేనాటికి కాస్త నయం. అది పెళ్లినాటికి చెప్పుకోతగ్గంకాకుండా ఉంది.

నాపెళ్లి స్థిరమైనరోజుకు నాకు పెళ్లంటే ఏమిటో తెలీదు. "ఈపిల్లే పెళ్లికూతురు" అని దాన్ని నాకు చూపించినపుడు నాకు దానిమీద ఏమో మమకారం కూడా కాస్త కలిగింది. ఏమగవాడు ఏ ఆడదాన్ని చేసుకున్నా ఒకటే నసీ, జరిగినవీ, జరగబొయ్యేవీ–పెళ్లిళ్లన్నీ రాసిపెట్టి ఉండినవే ననీ నాకు చాలాకాలమై తెలుసును. ఎవరిభార్య అందంగా ఉన్నదీ, ఎవరిభార్య అనాకారి అయిందీ అన్వేషించేవాళ్లు పనీపాటా లేని బుద్ధిహీను లని నేను నమ్మాను. అందం దేనికి? కూరొండుకుంటారా?

పెళ్లికి నాకు పధ్నాలుగేళ్లు.

అయితే సంబంధం స్థిరపడి ముహూర్తం సమీపించేలోపుగా, ప్రమాదం జరిగిపోయిందని నేను తెలుసుకున్నాను. మానాన్న వినకుండా వింటే పుతంవేసేస్తాడు మానాన్న!–నలుగురూ అయన్ని ఈ సంబంధం కుదిర్చినందుకు ఆడిపోసే మాటలూ, నా భావిగతిగురించి పడ్డబాధా విచారాలూ గమనించేటప్పటికి నాగుండెలో దడపుట్టింది. దాంపత్యంలో, తీరా, అందచందాలతో పనిఉందేమోననే సంశయం నాలో పుట్టుకొచ్చింది.

నాలో ఏ విశేషమూ లేదని గట్టిగా నమ్మిన నాకు నేనో నవమన్మధుణ్ణనే సువార్త ఈసందర్భంలో చెవినిపడింది. కాని అందుమూలంగా నా సంతోషం మరింత జాస్తి కావటానికిబదులు దిగులే జాస్తి అయింది. ఇటువంటి నాకా ఆ కురూపి!

ఒకరాత్రి ఎవరూ చూడకుండా పక్కలో పడుకుని ఏడిచాను — దేవుణ్ణి ప్రార్థించాను, ఈ సంబంధం తప్పించమని. అయితే దేవుడు నాకు సాయపళ్లేదు. సామాన్యంగా మానాన్న తలపెట్టినపనికి దేవు డడ్డుపడడు. అడ్డుపడాలని కొంత ప్రయత్నం చేసినవాళ్లు ఓడిపోయినారు. వాళ్లు దేవుడికన్న మొనగాళ్లు కారని రూఢిగా తెలిసిపోయింది.

నాపెళ్లి అయింది — ఆ కురూపికే.

నా భార్యపేరు సుందరి — సుందర మాణిక్యం; హ్రస్వనామం సుందరి.

నా జన్మకు తీరని అపచారం జరిగినట్టు భావించుకున్నాను. కాలక్రమాన అయినా నాకు న్యాయం జరగక పోతుందా అనుకున్నాను...కాని నాభార్య చచ్చిపోయి, నాకు మరో పెళ్లి కాలేదు!

అక్కడకూడా ఆశాభంగమే అయింది.

నాభార్య కాపరానికి రావటానికి సిద్ధంగా ఉంది. కురూపిదానితో కాపరం చెయ్యటం మొదలుపెట్టిన తరవాత నాలో ఏమార్పు కలిగేదీ నాకు తెలియదు; కాని ఏదోమార్పు కలుగుతుందనీ, అదివాంఛనీయమైన మార్పుకాదనీ మాత్రమే నే నెరుగుదును.

నాభార్య కాపరానికి వచ్చింది. ఆ గర్భాధానంనాటి రాత్రి నేను నాభార్యకేసి చూడటానికి జంకాను. తప్పని సరిగా చూడవలసి వచ్చేటప్పటికి అది నాకళ్లకు ఆటే అసహ్యంగా కనిపించలేదు. బహుశా నేను దాని అనాకారితనం గురించి ఉన్నదానికి మించి ఊహించటం వల్లనేమో!

"ఈ మొహంకాక ఇంకేమొహమైతే నాకు బాగుండేది?" అని ప్రశ్నించుకుంటే, నా కింకే మొహమూ ఆక్షణాన స్ఫురణకు రాలేదు.

"ఈ భార్యను నువు స్పృశించరాదు! దీనితో నీ కెటువంటి స్నేహభావమూ పనికిరాదు! ఇప్పుడు దీనితో ఎటువంటిసంబంధమైనా పెట్టుకుంటివా, అనుమానాస్పదమైన పత్రం మీద సాక్షిసంతకం చేసినట్లే!" అని నా అంతరాత్మ హెచ్చరించసాగింది.

అంతరాత్మ కేం తెలుసు, పాపం? మనం ఏమనమంటే అదల్లా అంటుంది. సమయం వచ్చినప్పుడు అట్లా అనమని నేను దానికి నాపెళ్లి అయిన మర్నాటినించీ, ఈ నాలుగేళ్ల బట్టీ, చెబుతూ వచ్చాను!

"ఇదో కొత్తఅనుభవం. చేతికి అందుబాటులోకివచ్చింది! నిన్నెవరూ శిక్షించరు! తరవాత నీ కిష్టమైనా కాకపోయినా, ఈ అనుభవం ఏమిటో తెలుసుకో! ఇంతలో వచ్చిన నష్టం ఏముంది?" అని ప్రకృతి నన్ను హెచ్చరిస్తూ ఉంది.

కేవలమూ జిజ్ఞాసతో కూడుకున్నవాణ్ణయి నేను నాకురూపిభార్యను సమీపించి చెయ్యి పట్టుకున్నాను. నేను మొదలునరికిన చెట్టల్లేపడిపోలేదు. కాని నాభార్య తలవంచుకుని సిగ్గుపడటం నాకు అనుకోని ఆనందం కలిగించింది. సిగ్గనేది నాభార్యకురూపిమొహానికి ఏమైనా అందం చేకూరుస్తుందేమోనని బలవంతాన దాని మొహం పైకెత్తి చూశాను. దానికళ్లు తడిగా ఉన్నై. ఒకటి రెండు చుక్కలు చెక్కిళ్లమీదిగా జారినై.

ప్రపంచంలో ఉన్న అందమైన మొహాల్లో అందమైన మొహం కనిపించినా నాహృదయం అంత చలించిఉండదు. నేను నా అంతరాత్మనూ, ప్రకృతినీ, నన్నూ ఒక్కసారిగా మరిచిపోయి ఆదుర్దాగా "ఎందు కేడుస్తున్నావు?" అన్నాను.

కాంతివంతమైన దీపంకేసి చూడబోయి చూడలేకపోయిన దానల్లే నాభార్యతల తిప్పుకుని ఏమీ లే దన్నట్టు తల ఆడించింది. నేను కళ్లనీళ్లు తుడవబోతే నాకన్న ముందే తను చీరచెంగుతో కళ్లు తుడుచుకుంది. అంతమేర చీర నల్లగా అయింది.

"నీ ఒంటి రంగు చూడు: కరిగి ఎట్లా వస్తున్నదో?" అన్నాను కాని మాట నోరుజారి వచ్చేసిన తరవాత భయంవేసింది— అది మళ్లీ ఏడుపు మొదలుపెడుతుం దేమోనని.

కాని అదృష్టవశాత్తూ అటువంటి దేమీ జరగలేదు. పైగా అది కొంచెంగా నవ్వి, చాలా చిన్నగొంతుతో, దాని కోయిల కంఠస్వరంతో "అటువంటి దాన్ని చేసుకున్నారు! ఏరికోరి!" అన్నది.

"నీ గొంతులో ఎంత అందం పెట్టాడు దేముడు!" అన్నాను.

"పోనివ్వండి, ఆ మాత్ర మన్నా —" అని మానేసింది నాభార్య.

కేవలం జిజ్ఞాసతో నాభార్యను కౌగిలించుకున్నాను. నా కేమీ రోతగాని, బాధగాని కలక్కపోవటం చూసి ఆశ్చర్య పడ్డాను. పైగా దానిచెంప నాచెంపకు తగలగానే చాలా ఆనందం కలిగింది. ఆ తరవాత పరిపూర్ణమైన నిర్లిప్తతతో — ఆనందంపొందే ఆశ ఈషణ్మాత్రమైనా లేకుండా — దానిమొహం చేతుల్లోకి తీసుకుని మూతి ముద్దుపెట్టుకున్నాను. అంతకన్న ఇంకోముద్దయితేమాత్రం ఎక్కువవేడిగా, ఎక్కువ ఘాటుగా, ఎక్కువ తియ్యగా ఉండవచ్చు నని నాకు తోచలేదు.

"ఎవరైనా చూస్తే నవ్వుతారు!" అన్నది నాభార్య.

"నన్నట్లా అంటే మరింత రేగుతాను!" అని, రుజువుకూడా చేశాను.

"మీరింత మంచివారు!" అన్నది నా కురూపి భార్య. పాపం, దానికి భావప్రకటన చేసేటందుకు భాష లేదు. అయితే దాన్ని అర్థంచేసుకునేటందుకు భాష అవసరం లేకపోయింది.

ఆ కురూపిభార్యను ప్రేమించి నేను సంఘానికి చాలా ద్రోహంచేసిఉండాలి. అందరూ నన్ను విడ్డూరంగా చూడ సాగారు. చక్కని వాళ్లం అనుకునేవాళ్లంతా నన్ను చూసి నా ఎదటే నవ్వారు. నేను ఎదటపడగానే నాతో గంభీరమైన విషయాలు కూడా ఆపుకుంటే ఆగని నవ్వుతో మాట్లాడసాగారు.

"ఈ పెళ్లానికే ఇంత ఉబ్బి తబ్బిబ్బులవుతున్నాడు. ఇంకా రంభ దొరికితే" అని ఎవరో అన్నట్టు నాకు రూఢిగా తెలిసింది.

ఆడతన మంటూ ఉన్న ఏ పదార్థానికైనా నేను "పడతా"ననే విశ్వాసంతో కాబోలు ఒకముప్ఫైఅయిదేళ్ల పూర్వసుందరి ఒకామె నాతో సరస సల్లాపా లారంభించింది. ఆవిణ్ణి ముద్దుపెట్టుకుంటే వెచ్చగా, ఘాటుగా, తియ్యగా ఉంటుం దని నాకేమీ నమ్మకం చిక్కలేదు. ఆవిడసౌలభ్యం వదిలించుకున్నాను.

నేను సంఘానికి ద్రోహం చేశా నని నాకే నమ్మకం కలిగింది. తప్పుపనులు చేసినంత మాత్రంచేత సంఘం కన్నెర్ర చెయ్యదు–ఆచేసే తప్పేదు పనులు తప్పుచేసేవాడల్లే చేస్తే. అయితే నేను ఈ విషయంలో కొంచెం నిర్లక్ష్యంగా ప్రవర్తించి ఉంటాను. నాభార్య నా కనుచూపుమేరలోకి వస్తే నేను తప్పని సరిగా నవ్వేవాణ్ణి, కళ్లతో మాట్లాడేవాణ్ణి. నాభార్య బదులు చెప్పేదికాదు. కాని స్వీకరించేది. నాకంటె భాషకోసం వెతికేది.

"నావంక అట్లా చూడకండి! నా ఒళ్లంతా జిల్లు మంటుంది! అంతా కనిపెట్టి ఎగతాళి చేస్తారు. ఇప్పటికే పడలేకుండా ఉన్నాను. ...వాళ్లు అనేవి నవ్వుతూనే అంటారుగాని ఇవతలవాళ్ల కెట్లా ఉండేదీ ఆలోచించరు!" అని అది నన్ను హెచ్చరికవేటుగా మందలించేది.

"ముందు ముందు నీ మొహం చూడని రోజులొస్తై! నీ చేతి మంచినీళ్లు కూడా తాగని రోజులొస్తై! ఇంతకురూపితో ఎన్నాళ్లు కాపరం చేస్తారు– ఎంత నవమన్మథులైతే మటుకు! ఈ నాలుగురోజులూ ఏదో విధంగా గడిచిపోనివ్వక నా కడ్డం చెబుతావేం?" అని నేను దాన్ని గట్టిగా కోప్పడేవాణ్ణి.

దానిమీదట నాభార్యకు పశ్చాత్తాపం కలిగి తన ముక్కుతో నావీపులో చక్కిలిగిలి పెట్టేది —నేను ఎప్పటికీ ఆమాట అన నని వాగ్దానం చేసేవరకూ!

నాభార్యను ఇతరులు అనాకారి అంటున్నకొద్దీ దానితో ఆపేక్షగా ఉండ దలిచాను. నాకు అదొక ఆశీర్వాద మల్లే పనిచేసింది. నలుగురు అందమైనవాళ్లమధ్య నాభార్య కనిపిస్తే ఆ అందగత్తెలను హత్యచేశా మనిపించేది; నాభార్యమీద అపారమైన జాలి కలిగేది. తరవాత దాన్ని ఒంటరిగా చిక్కించుకుని ముద్దుపెట్టుకునే వరకూ ఆబాధ తగ్గేదికాదు.

ఒకసారి నాభార్యతో ఎవరో ఒక ఇల్లాలు "ఏమమ్మాయ్, నీమొగుడు నువ్వెంత చెబితే అంతేటగా?" అనటం నాచెవిన పడ్డది. ఆ రోజునించీ పనిపెట్టుకుని నాభార్య యెడల వినయ విధేయతలు కనబరచ సాగాను.

"మీరు నన్నిట్లా చంపుకు తింటున్నారేమండీ?" అన్నది నాభార్య. ఏ మన్నాను.

"మీరు నాచెప్పుచేతల్లో ఉన్నారని అంతా అనుకుంటున్నారు. నిజం వాళ్లకేం తెలుస్తుందీ?"

"నిజ మేమి" టన్నాను.

"పోనిస్తురూ!" అన్నది నాభార్య దిగులుగా.

"పిచ్చిదానా, నీకు వాళ్లతో ఏమిటి? వాళ్ల మాటలు నే నేం పాటిస్తున్నాను?"

"మీ కేం? మగవాళ్లు. మీకు జరుగుతుంది!"

"నువ్వూ మగవాడివే! ఇంత కోతి ఆడ దెట్లా అవుతుంది?"

"అదీ, మాటతోనే నే పద్ధతి!"

తన అనాకారితనం నాభార్యను చాలా బాధిస్తున్న దని చాలాకాలం తెలీదు. ఒకనాడు సుందరి "ఈ జన్మకు మీకు నే నేగదా పెళ్లాన్ని?" అన్నది.

"ఏ మయితే?"

"ఏమీ కాలేం? నేను కురూపినీ, మీ రందగాళ్లూనూ!"

"కురూపితో కాపరం చెయ్యటం కష్టమా?"

"కాదూ మరి?"

"నేను కష్టపడుతున్నట్టు కనిపిస్తున్నానా?"

"ఇది సొంతం పెళ్లాం దని సీ న ను కుంటున్నా నా?"

"పోనీ, అందగాడితో కాపరం చెయ్యటం సులభమా? నీకు హాయిగా వెళ్లుతున్నదా?"

"మీ కెవరు సమాధానం చెబుతారు?"

అప్పుడు నే నన్నాను: "నేనుమాత్రం నిన్నే పట్టుకుని వేళ్లాడుతున్నానా ఏమిటి? ఎవరన్నా అందగత్తె కావాలంటే నాకు దొరక్కపోతుందా?"

"ఏదో చేసి కొంపమీదికి తీసుకురండి!"


కేవలమూ అసూయ వెళ్లకక్కినవాళ్లు వెళ్లకక్కగా నన్ను శాస్త్రోక్తంగా చేసి విమర్శించినవాడు మా మేనమామకొడుకు. వాడు పత్రికల్లోనూ అక్కడా బూతుకథలు రాస్తాంటాడు.

వాడు నాకూ, నాభార్యకూ ఉన్న సంబంధం పశుకామమని రుజువుచేశాడు. అయితే, విజ్ఞానికనక పశుకామంలో తప్పేమీ లే దన్నాడు. మళ్లీ, నేను మరొక స్త్రీని ఎరగని కారణంచేత నాభార్యమీద నాకున్న ప్రేమలో విశిష్టత ఏమీ లే దన్నాడు.

"నాభార్య నావంక ఎట్లా చూస్తుందో ను వ్వెరగవు!" అన్నాను. "నన్నెంత గాఢంగా కౌగిలించుకుంటుందో ఊహించలేవు" అన్నాను.

(16-వ పేజీ చూడుడు)

## కర్ణాటక గ్రామసీమ





త్రాగుడు నీటికోసము తరలి వచ్చుచున్న కర్ణాటక కామినులు.

## కురూపి భార్య

(7-వ పేజీ తరువాయి)

"అదే నే ననేది!" అన్నాడు వాడు. "అయిన ప్పటికీ నీ ప్రేమ సాగారవాన్ని ఆకర్షిస్తున్నది!" అన్నాడు.

వాడు నా ప్రేమను పశుకామం అనటం నేను సహించ లేకపోయినాను. నే నింకో ఆడదాన్ని ఎరగనందుకు అవమానం కూడా కలిగింది. నా భార్యలో ప్రత్యేకత లే దని అనటంకంటె ఇంకేం అవమానం కావాలి?

నాదృష్టి వెంటనే కనకంమీదికి పోయింది. అది ఒకప్పుడు దాదాపు నాకు భార్యఅయినంత పని జరిగింది. "నువు నాకు మొగుడి తరవాత మొగుడం తవాడివి!" అని నాతో నవ్వుల కనేది. నేను కాదని ఒక తేళ్యం గాడి కిచ్చారు దాన్ని. అది తప్పుడు పనులకు ఇంకా దిగలే దేమోగాని దిగటానికిమాత్రం సిద్ధంగా ఉందని నాకు రూఢిగా తెలుసు. ఒకటి రెండు సార్లు ఉత్తరాలుపట్టుకుని దాన్ని చితకగొట్టటం కూడా జరిగింది. వాళ్లింటికి నేను స్వేచ్ఛగా వెళ్లిరాగలను.

వాళ్లింటికి వస్తూ పోతూఉండటం ప్రారంభించాను. కనకం నాకోసం ఎంతోకాలంగా కనిపెట్టుకుని ఉన్నదానల్లే నేను చెయ్యిచాచ గానే అందింది.

కాని మాదొంగతనం వెంటనే బయటపడింది. నేను దానికొంగు పట్టుకు లాగుతుండగా దాని మొగుడే చూశాడు. ఇక అక్కడ ఒక్కక్షణం కూడా ఉండ బుద్ధిపుట్టలేదు.

అక్కణ్ణించి నే నింటికి పోలేదు, ఎటు పోతు న్నదీ తెలియకుండా ఊరువిడిచి చాలాదూరం వెళ్లాను. పాడుపని చేసి బయటపడ్డానన్నదికూడా నన్ను బాధించలేదు. ఈ అనుభవం—కనకంతో అనుభవం—నన్ను మార్చింది. ఎంత చెడ్డా కవి గాడు కొంతనిజమే చెప్పాడు. ఇవక ఎన్నడూ కలగని విచారం ఒకటి నన్నిప్పుడు పట్టుకుంది: నాకు కనకమే భార్య అయి ఉండకూడదూ? లోకంలో ఉన్న అందగత్తె లంతా ఎవరి భార్యలో కావటానికి నేనేం పాపంచేశాను? కనీసం సుందరి సంసారపక్షంగా నైనా ఉండ రాదూ? మరీ కురూపి...అందులోకూడా అంత ఈనక్ర బద్దవంటి మనిషి!—

నేనింటికితిరిగి వచ్చేటప్పటికి పొద్దుగూకింది. ఇంటో అడుగుపెట్టగానే ఇల్లంతా ఎగిరిపారేట్య టంత హైరావణరథస!

"—అటువంటి కురూపిముండను కట్టు కోవటమేం? ఊళ్లోవాళ్ల కోడళ్లమీద పడట మేం? తనకు ఆడతోడు లేదూ?" అని అరు స్తున్నది కనకంఅత్తగారు.

"ఒకవేళ నువు పొరపాటు పడిఉంటా వేమో!" అని మా అమ్మ ప్రారంభించగానే, "చా శ్లేవమ్మా? నాకోడలు చెప్పలా? వారం రోజులనించీ దాన్ని ఏమిటో పలకరించ బో తాట్ట, అడ్డం తగులుతాట్ట! ఇవాళ కొంగు పట్టు కులాగాడు, రేపు చేయి పట్టుకు లాగుతాడు!"

నేను నిర్ఘాంతపోయినాను. ఒక మహాఇల్లాలు అంత అవాచ్యంగా మాట్లాడటానికి ప్రయత్ని స్తుందని నేను, దైవసాక్షిగా, ఎన్నడూ భావించ లేదు. ఈ పోట్లాటకు రావటంలో ఆవిడకు కొంత ఆనందం కూడా లేకపోలేదని గ్రహించ గలిగాను. ఎవరిపశుత్వం ఎవరు ఎట్లా బయట పెట్టుకునేదీ ఎవరమూ చెప్పలేం?...


### కంటిపొర

కంటిపొరకు, ఇతర కంటిజబ్బులకు గ్యారంటీగా పనిచేయు డిగాన్స్ "ఐక్యూర్" (రిజిష్టర్డు) మందును వాడిచూడుడు. ఎట్టి అపాయమూ లేదు. శస్త్రచికిత్స లేకయే వేలకొలది ప్రజలకు నిమ్మళించినది. తప్పక గుణమిచ్చును. ప్రపంచ ఖ్యాతిబడిసినది. ధర రు 2/- పోస్టేజీ అ -/10/-

**KAMALA Works (A. P.)**
**Panchpota, Bengal.**



కొక్కోకము:—64 చిత్రపటములతో 302 పేజీలు గల పెద్ద పుస్తకము ధర రు1/-పోస్టు ఖర్చులు అ. 5. ఇందులో స్త్రీపురుష శృంగార రహస్యములు గలవు. రామహాజబుక్ డిపో, 18, బీటు,జి.టి.మద్రాసు.


కనకం దివ్యంగా బొంకిం దన్నమాట! పిరికి పక్షి! అందుకనే కాబోలు నేను దాన్ని దాని మొగుడివాత వదిలేసి నా దారిన వెళ్లాను. మా సుందరిని — మాకోతిని — ఎప్పుడన్నా అట్లా ఇతరులవాత విడిచిపెట్టి ఎరుగుదునా?...

సుందరి! దాన్ని ఈ ముసలిముండ ఫెడేలున ఎంత మాట అన్నది! ముందు ఆ ముసలిదాన్ని చిత్రవధ చెయ్యాలా, సుందరి ఈ తుపానులో ఏమూల చిక్కిపోయిందో చూడాలా? ముసలి దానిజోలికి పోవటం అక్షణావివేకంకా దని పించింది. సుందరికోసం నాగదిలోకి పరిగెత్తాను.

నే నూహించినట్టే సుందరి దుఃఖసముద్రం లో మునిగిఉంది. నన్ను చూడగానే కళ్లుతుడుచు కుంటూ, "నా మూలంగా మీ రెంత మాటలు పడుతున్నారో చూడండి!...కాస్త జాగర్తగా ఉండరూ? నేను చెప్పలేదా? నన్ను చేసుకోవ టం ఊరికే పోదని!" అన్నది.

"ఇది నీకేమీ సంబంధించిన విషయంకాదు. నేను కనకంకొంగు పట్టుకు లాగుతుండగా దాని మొగుడు చూశాడు."

"అయ్యొయ్యో! ఏం పన్లండీ ఇవి? నాకేం సంబంధం లేదంటారేం? నేను చక్కం దాన్న యితే మీ రిటువంటిపనులు చేస్తారా?"

"ఏమీ చెయ్యకుండా, నువుకూడా చక్కం దానివేనని రుజువు చెయ్యటం ఎట్లా మరి?" అన్నాను మా అనాకారి సుందరిని దగ్గిరికి లాక్కుని.

## నిజమైన శ్రేయస్సం టేఏది?

(9-వ పేజీ తరువాయి)

కారణం చేతే ఆ నిమ్నజాతుల్లో ఆలాటిసంతా నంబాపతువాళ్లనీ యీలాటిసంతానంబాపతు వాళ్లనీ యేర్పాటువున్నట్టు లేదు. అంతా కలగాపులగం గానే యావన్మర్యాదలూ జరుగుతూ వున్నాయి. అందుచేత యీ కర్మం అగ్రవర్ణాలల్లోనే క్వాచిత్కంగా వుండే దనిన్నీ ఆబాపతుసంతానం హవ్య కవ్యాదులకు అనర్హంగా వుండవలసి వచ్చేదనిన్నీ కేటాయింపుగానే వుండే దనిన్నీ అనుకోవాలి. పూర్వం అన్నిటికన్నా పెద్దమర్యాద హవ్యకవ్యాలకు అర్హత వుండడమే. అందుచేతే ధర్మశాస్త్రాల్లో "హవ్యకవ్యేషు గర్హితః" అని తఱుచు వ్రాస్తూ వుంటారు. అందుకు అర్హతంటూ లేని పక్షంలో ఆప్రాణికి యెంత ఐశ్వర్యం వుండినా యెంత విద్య వుండినా లేశమున్నూ సభ్యత లేనేలేదు. రాజులు వుద్యోగా లివ్వవలసివచ్చినా ఆలోపాన్నే పెద్ద చేసి బహిష్కరించేవారు. కులీనులు పిల్ల నివ్వవలసివచ్చినా అదే కర్మం అడ్డు తగిలేది. దానిపేరే తెలుఁగులో 'వెలి'అనేది. దాన్నే మతగురువులద్వారా కూడా శాంక్షన్ కాఁబడ్డదైనట్టయితే 'అంక్ష' అంటారు. మత గురువులకు పూర్ణమైన అధికారం యీవిషయాలలో పూర్తిగా నిన్నమొన్నటివఱకున్నూ వుండేది. యిప్పుడున్నూ ఆ అధికారం చెక్కు చెదరకుండా నిలిచే వుందికాని ప్రజలు తెలుఁగు మీరి యెదిరిస్తూ వున్నారు. ఇవక చాలాకాలం నాఁడు తనకు లేని అధికారాన్ని కలిగించుకొని యజ్ఞమో యాగమో చేశాఁడని స్వాములవారు పరగౌరవవ్యక్తికి మతరీత్యా అంక్షను పూర్వాచారప్రకారంగా జారీ చేసేటప్పటికి ఆమహా వ్యక్తి "లీగల్"గా మతగురువుమీఁద బ్రిటిషు కోర్టులో అభియోగం తెచ్చినట్టున్నూ, దానిమీఁద తీర్పుకర్త స్వాములవారికి వున్న అధికారాన్ని అంగీకరిస్తూకూడా ఆ జారీచేయడం కార్డుమీఁద జరగడంలో మామూలు అమర్యాదకంటె మఱికొంత అదనంగా వుంది కనక అది బ్రిటిషు రాజ్యతంత్రరీత్యా దోషమని చెప్పి పది రూపాయీలు కాఁబోలును జరిమానా విధించినట్టు చెప్పుకోఁగా విన్నాను. పూర్వరాజుల కాలంలో మతగురువుల శాసనం యెప్పుడూ యీలాటి అవమానాన్ని పొందినట్టు లేదు. అది మొదలు మెల్లిమెల్లిగా మతగురువు లంటే ప్రపంచానికి భయం తగ్గడానికి ఆరంభించింది. ఖండాంతరాలలో మనకంటె యీమతగురుత్వం కొంత వాఁడి కలిగి వుందని వినికి. వెలి అంటే పూర్వకాలంలో వున్నంత కాదుగదా యేమాత్రంవిలువా వుండకుండా పోయింది. మన దేశంలోనే యీపోవడం అగ్రజాతులవారికి మాత్రమే. పీఠాధిపతులంటూ యేర్పడి వారి శాసనాన్ని శిరసావహించేవార మనుకొనే వారికే. యిఁక కులపెద్ద అంటూ వకణ్ణి యేర్పఱుచుకొని అతని ఆజ్ఞకు కట్టుఁబడి వర్తించే నిమ్నజాతుల్లో చెక్కుచెదరకుండా ఆ కులపెద్దశాసనం అమలు జరుగుతూనే వుంది. వెలి అంటే యేలాటిదో? యిప్పటి వారికి తెలియనే తెలియు దన్నా తప్పు లేదు.

నా చిన్నతనంనాఁటికి దేశమింకా యింత బరితెగించలేదు కనక దాని "ఫోర్సు"ను గూర్చి నేను కొంత యెఱుఁగుదును. యింకా ప్రాచీనకాలంలో వెలినిగూర్చి పురాణాల్లో చదివితే తెలుస్తుంది. అశ్వినీదేవతలకి దేవతల్లో వెలి వుండేది. యెందుచేత? వారు వైద్యం చేసేవా రనే కారణంచేత. వైద్యంచేయడం అంటా? బొంకా? తాగడమా? జూదమాడడమా? అని ప్రశ్నిస్తారేమో? అలా ప్రశ్నించకండి. వైద్యం సర్వజనోపయోగమైన మహాకార్యమే అయినా యేవో కొన్ని మతరీత్యా అనుచితంగా వుండే వ్యాపారాలు దానిలో నాంతరీయకత యీ వున్నాయని చెప్పి ఆ కాలంలో ఆ వైద్యవృత్తిని దేవత లందఱూ హేయంగా చూస్తూ వచ్చా రనుకోవాలి. ఆకారణంచేత వారికి వెలి, అన్నారు. దానికి అర్థం "హవ్య కవ్యాల"లోకి రానివ్వకపోవడమే. ఆలాగే చిరకాలం జరిగాక చ్యవనుఁడికి వారు వైద్యంచేసి తద్ద్వారాగా ఆ వెలినుంచి విముక్తులైనట్టు పురాణాల్లో వుంది. కావలసినవారు చదువుకోండి.

యిటీవల యీ వెలిబాధను అనుభవించిన వాఁడు సుప్రసిద్ధులలో వేములవాడ భీమకవి వకఁడు వున్నట్టు అతని చరిత్రవల్ల కనపడుతుంది. అతఁడికి తల్లిమాత్రమే వుందిగాని తండ్రి లేఁడు. అతని తల్లి నిష్కళంక బ్రహ్మచారిణిగానే వున్నా పుత్రోత్పత్తినిబట్టి ఆపెచరిత్రకు సామాన్యలోకులు సందేహపడి వెలి వేశారు. తరవాత మన భీమకవి తాను సాక్షాత్తుగా ద్రాక్షారామ భీమేశ్వరుని కొడుకు నని ఋజువు చేసి ఆ వెలినుండి విముక్తుఁడైనట్టు యితిహాసం వల్ల తెలుస్తూ వుంది. దానికి వుపోద్బలకంగా భీమకవిగారి— "ఘనుఁడన్ వేములవాడ వంశజుఁడ ద్రాక్షారామ భీమేశనం దనుఁడన్" అనే పద్యం కనపడుతూ వుంది!

సరే. ఆయాకథలు నమ్మతగ్గవా కావా అనే విచారం మన కిక్కడ ప్రస్తుతం కాదు. వెలి అనే దానికి మనుష్యులలోనే కాక దేవతలలోకూడా యేలాటి స్థానం వుండేదో తెలుసుకోవడమే. అయితే కొందఱు దీన్ని మిషగా పెట్టుకొని యోగ్యులకు అపవాదులు కల్పించి చేసిన అపకారాలు వున్నట్టు వినలేదు గాని అయోగ్యుల విషయంలోనే గోరంతలు కొండంతలుగా పాలిపి పీఠస్థులకు వ్రాసి అంక్షపత్రికలు తెప్పించడమున్నూ వుండేది. ఆలాటిమోసాన్ని అవలంబించి రాజకీయాధికారులను కూడా కళ్లుకప్పి దుర్మార్గులసంఘాలు నిషధయోగ్యులను సహా దండింపచేయడం యెప్పుడూ వుంటూనేవుంది. క్రయమాట. పీఠస్థులభయం అగ్రవర్ణాలవారికి పూర్తిగా నశించిం దని తేలింది. అందుచేత అందఱూ కాకపోయినా కొందఱు నిమ్నవర్ణాల వారి ఆచారాలను అవలంబించి సుఖిద్దా మనే అదుర్దాలో వున్నారు. యెప్పుడూ లోకానికి జంకి కొంత హద్దులో వుండే వ్యక్తులే విస్తారంగా వుంటారుకాని పరలోకానికి జంకి కట్టుఁబాట్లలో వుండే వ్యక్తులు చాలా తక్కువగానే వుంటారు. వారు దేశమంతా తల్లక్రిందులైనా సరే వారిదారి సదాచారాలను జరిగినంతలో జరుపుకుంటూనే వుంటారు. శైవులలో తమకు గురుముఖతః సంప్రాప్తమైన లింగం దొంగలు కొట్టి అపహరించిన సందర్భంలో కూడా మళ్లా ఆలింగం సంప్రాప్త మయ్యేవఱకూ పచ్చిమంచినీళ్లుకూడా ముట్టక తుదకు ప్రాణత్యాగం చేసినవారు నిన్నమొన్నటివఱకున్నూ వుండేవారు. యేదో లింగం తెచ్చి యిచ్చి వారిని ఆ వుదక్షమానుష్ఠించిమళ్లిద్దామని ప్రయత్నించికూడా విఫలు లయినట్టు శతశః సహస్రశః వినడం. యెవరిలింగం వారికి ఆనవాలుగా వుంటుందఁట! కొందఱికి ఆ దీక్షాకాలంలో యేదోవిధంగా అసలులింగమే సంప్రాప్తమయి జీవించడమున్నూ తటస్థించినట్టున్నూ వినికి వుంది — యీలాటి అసిధారావ్రతస్థులు వారంతట వారు నియమ ప్రవర్తనను కాపాడుకొనేవారే గాని యితరుల భయంవల్ల కాపాడుకొనేవారిలోనే చేర్చతగ్గవారు కారు.

## అపాలచికోలా

పీడ్‌మాంటులో పుట్టి చాలా నదులు తమ ఎర్రని బండుమట్టి ప్రవాహాలతో వచ్చి మెక్సికో సింధుశాఖలో సంగమిస్తాయి. అమెరికాలోని, ఆదిమనివాసులు పీడ్ మాంటు అనే పేరును సాధారణంగా విని ఉండరు. సంయుక్తరాష్ట్రాలలో ఆగ్నేయతీరాన పర్వత పంక్తికిన్ని మైదానానికిన్ని మధ్య ఉండే ప్రదేశాన్ని పీడ్‌మాంటు అంటారు.

ఈ ప్రదేశంలో స్మరణీయమైంది అపాలచికోలా. ఇది అచ్చట ఉండే అదే పేరు గల ఒక నది ఒడ్డున నున్న ఒక చిన్న పట్టణము. ఆ పట్నం ఇప్పుడు జీర్ణావస్థలో నున్న దని చెప్పవచ్చు.

ఆ వూరు నివాసులు వర్ణ భేదము లేకుండా వసారాల్లో కూర్చుని ఇప్పటికీ తమ పట్నం యొక్క పూర్వాన్నత్యాన్ని గురించి, ఆపట్నపు ఇద్దరు పురాతన వీరుల్నిగురించి ముచ్చటించు కుంటూ ఉంటారు.

నెమ్మదిగా ఆ ఎర్రనది వాళ్లముం దర్నించి ప్రవహిస్తూనే వుంటుంది. ఉత్తరంగా ప్రత్తి పొలాల ప్రక్కనుంచి, పారిశ్రామిక పట్నాల ప్రక్కనుండి ఎన్నోమైళ్లు పారుతుంది ఆదే నది. ఆ మైదానాల్లో నివశించే ప్రజలను పీడించే ఆ పిశాచం - ఆ మలేరియా పిశాచం - ఆ నది తిరిగే మెలికలలోనే గోచరిస్తుంది.

దక్షిణఖండాన్నంతా బాధిస్తుంది ఈ మలేరియా. ఆ పాలచికోలాలాంటి నదులు వరదల కాలంలో ఎన్నోవేల ఎకరాలను ముంచివేస్తాయి. ఆ మురికినీటితో మలేరియా దోమలు కూడా దిగుతాయి. మలేరియా బాధించే దేశాల్లో యీ దేశభాగం అగ్రస్థానం వహిస్తుందని ఫ్లారిడా స్టేటు ఆరోగ్యశాఖవాళ్ళ సంఖ్యలను బట్టి తెలుస్తుంది.

క్వినైను తప్పకుండా ఈ పరిస్థితులను మార్చగలదు. కాని చాలమందికి దానివిలువ, ప్రమాణము, చౌకతనము తెలియవు. ఇంత చౌక అయిన ఔషధాన్నే కొనలేనివారు ఎంతో మంది ఉండటం చాలా శోచనీయం. జాతిసమితి యొక్క మలేరియా కమిషనువారు జ్వరపు ఋతువునందు నివారణకై రోజూ 6 గ్రైనుల క్వినైనున్ను, జ్వర మున్నచో తగ్గుటకుగాను 5 లేక 7 రోజులవరకు రోజూ 15 నుండి 20 గ్రైనుల క్వినైనున్ను పుచ్చుకొనవలె నని సూచించియున్నారు. మలేరియా కమిషనువారు తమ 1938-వ సం॥ నివేదిక 225 పుటలో క్వినైను తన మలేరియా నివారణశక్తివల్లను, మత్తు కల్గించకుండచేయుటవల్లను, దానియొక్క ప్రమాణము అందరికి తెలిసియే యుండుటచేతను మలేరియా నివార ఔషధములలో అగ్రస్థానము వహిస్తుందని తెల్పియున్నారు.

ఇంతకూ అపాలచికోలాలో కావలసిన క్వినైను ఖరీదు అచ్చటకు దక్షిణదేశంలోను, ఏటేటా మలేరియా గావిస్తున్న ధ్వంసంలో తృటి మాత్రమే. M. 263